

వైద్య కళాశాలలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భగత్‌నగర్, సెప్టెంబరు 26: కరీంనగర్ వైద్య కళాశాలలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సీని యర్ రెసిడెంట్స్ పోస్టుల భర్తీకి ప్రభుత్వ వైద్య విద్య సంచాలకులు అనుమతిం చారన్నారు. కళాశాలలో వివిధ కేటగిరీల్లో 31 పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఈనెల 30న ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కళాశాల వెబ్‌సైట్‌లో అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుని, ఒరిజినల్ సర్టిఫికెట్స్, రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో ఇంట ర్వ్యూకు హాజరు కావాలన్నారు.



కరీంనగర్ డెయిరీకి
నెయ్యి సంక్షోభం

- ఆలయాలకు విజయ డెయిరీ నెయ్యినే వాడాలని ప్రభుత్వ నిర్ణయం
- నెలకు సుమారు రూ.2 కోట్ల అమ్మకాలకు బ్రేక్
- ఆందోళనలో పాడి రైతులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రాష్ట్రంలోని దేవాలయాలకు విజయ డెయిరీ నుంచే నెయ్యి కొనుగోలు చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ తీసుకున్న నిర్ణయం కరీంనగర్ డెయిరీకి శాపంగా మారింది. ఈ నిర్ణయం కారణంగా ప్రతినెలా సుమారు రెండు కోట్ల రూపాయల విలువ చేసే నెయ్యి విక్రయాలకు బ్రేక్ పడింది. యేటా ఆలయాలకు కరీంనగర్ డెయిరీ 30 నుంచి 35 కోట్ల రూపాయల విలువ చేసే నెయ్యిని విక్రయించేది. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో లక్ష మంది పాడి రైతులు సభ్యులుగా ఉన్న కరీంనగర్ డెయిరీ సంక్షోభంలో పడిపోయింది. కరీంనగర్ డెయిరీ గా పిలిచే కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్‌లో కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, నిజామాబాద్, కామారెడ్డి, మంచిర్యాల, జనగామ జిల్లాలకు చెందిన పాడి రైతులు పాలను విక్రయిస్తూ సంస్థలో సభ్యులుగా ఉన్నారు. రోజుకు రెండు లక్షల లీటర్ల పాల సేకరణ సామర్థ్యం గల ఈ డెయిరీ ఇటీవల కేంద్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో ఐదు లక్షల లీటర్ల పాల సేకరణ సామర్థ్యాన్ని పెంచుకున్నది.

ధర తగ్గిస్తామన్నా.. ససేమిరా..

డెయిరీ నుంచి వేములవాడ రాజరాజేశ్వరస్వామి, భద్రాచలం సీతారామచంద్రస్వామి, బాసర సరస్వతీ దేవి, కొండగట్టు ఆంజనేయస్వామి, ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి, కొమురవెల్లి మల్లికార్జునస్వామి, కాళేశ్వరం కాళేశ్వరముక్తీశ్వరస్వామి, వరంగల్ భద్రకాళి ఆలయాలకు ప్రతినెలా 30 టన్నుల నెయ్యిని సరఫరా చేస్తున్నది. ఓపెన్ మార్కెట్‌లో మరో 10 టన్నుల నెయ్యిని విక్రయిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు దేవాలయాలకు కిలో నెయ్యిని 609 రూపాయలకే విక్రయించడానికి కరీంనగర్ డెయిరీ అంగీకారం తెలిపింది. విజయ డెయిరీ నుంచి మాత్రమే నెయ్యిని కొనుగోలు చేయాలని అన్ని ఆలయాలకు దేవాదాయశాఖ నుంచి ఉత్తర్వులు అందడంతో ఈ నెల నుంచి ఉత్పత్తి చేసే మొత్తం నెయ్యిని ఓపెన్ మార్కెట్‌లో విక్రయించే అవకాశాలు లేక డెయిరీ యాజమాన్యం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. ఫలితంగా బహిరంగ మార్కెట్‌లో ధరను తగ్గించి అమ్మడం, ప్రత్యామ్నాయ ఉత్పత్తుల వైపు దృష్టిసారించాల్సిన పరిస్థితులు నెలకొంది. దీంతో డెయిరీ ఆదాయం తగ్గే అవకాశం ఉంది.

ప్రభుత్వ హాస్టళ్లకు పాల సరఫరాపై ఆంక్షలు

కరీంనగర్ డెయిరీ నుంచి సోషల్ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లు, మోడల్ పాఠశాలలు, గురుకుల పాఠశాలలకు రోజు ఎనిమిది వేల లీటర్ల పాలను సరఫరా చేసేవారు. పాలను కూడా విజయ డెయిరీ నుంచే కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ కావడంతో ఆ మేరకు పాల విక్రయాలు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడిందని డెయిరీ సభ్యులు వాపోతున్నారు. అమ్మకాలు తగ్గితే పాల సేకరణను తగ్గించు కోవలసి వచ్చి రైతులు నష్ట పోయే అవకాశమున్నది. పాల సేకరణను యథావిధిగా కొనసాగించాలంటే పౌడర్ తయారీకి మళ్లించాల్సి వస్తుంది. దీంతో ఒక్కో లీటర్‌పై ఏడు నుంచి ఎనిమిది రూపాయలు అదనంగా కన్వర్షన్ చార్జీల కింద వెచ్చించాల్సి ఉంటుంది. రవాణాకు అదనంగా డబ్బు చెల్లించాల్సి వచ్చి సంస్థపై భారం పడుతుంది. ఇది పాడి రైతులపై ప్రభావం చూపించే అవకాశం ఉంది.

పోరాట యోధురాలు ఐలమ్మ

కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 26: తెలంగాణ రైతాంగ సాయుధ ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించిన చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలు అని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురు వారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవంలో కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ పౌరుషాన్ని, పోరాటాన్ని, త్యాగాన్ని భావితరాలకు అందించి ఉద్యమస్ఫూర్తిని రగిల్చారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, డీఆర్‌వో పవన్ కుమార్, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

యువత సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలి

కలెక్టర్ పమేలా సత్పతి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 26: మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలను యువత కాపాడాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ స్టేడియంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి వ్యక్తిలో ఏదో ఒక కళ దాగి ఉంటుందని దానిని బయట తీయటానికి యువజన ఉత్సవాలు ఉపయోగపడతాయన్నారు. స్వామి వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, యువత తలుచుకుంటే సాధించనిది ఏమీ లేదని అన్నారు. యువత చెడు మార్గంలో పయనించకుండా సన్మార్గంలో పయనించాలన్నారు. సామాజిక సేవలో కృషి చేసిన యువజన స్వచ్ఛంద మహిళ సంఘాల సభ్యులకు మెమొంటోలను అందజేశారు. యువజన ఉత్సవాల్లో ప్రతిభ కనబరిచిన వారికి మెమొంటోలు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కలెక్టర్ పమేలా సత్పతికి స్వామి వివేకానంద చిత్రపటాన్ని యువజన సంఘాల సభ్యులు అందజేశారు. జిల్లాలోని కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలకు మంచి స్పందన లభించింది. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి వి శ్రీనివాస్‌గౌడ్, నెహ్రూ యువ కేంద్ర కో ఆర్డినేటర్ వి రాంబాబు, జానపద కళాకారులు సంగెం రాధాకృష్ణ, యువజన అవార్డు గ్రహీతలు కళింగ శేఖర్, సత్తినేని శ్రీనివాస్, అలువాల విష్ణు పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న మహిళలతో కలెక్టర్ పమేలాసత్పతి, డీవైఎస్‌వో శ్రీనివాస్



యువతి నృత్యం



యువజనోత్సవాల్లో భాగంగా జానపద పాటలు పాడుతున్న కళాకారులు



విద్యార్థుల ప్రదర్శన

మూడు నెలలకోసారి స్ట్రీట్ వెండింగ్ కమిటీ సమావేశం

కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 26: ఇకపై ప్రతి మూడు నెలలకోసారి స్ట్రీట్ వెండింగ్ జోన్ కమిటీ సమావేశం నిర్వహించి వీధి వ్యాపారుల సంక్షేమ, సమస్యలపై చర్చిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ వెండింగ్ జోన్ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతన వెండింగ్ జోన్ల ఏర్పాటు, వెండర్స్ కార్డ్స్ రెన్యూవల్, బీమా తదితర అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం టౌన్ లెవల్ బ్యాంకర్ల సమావేశాన్ని కమిషనర్ నిర్వహించారు. స్వశక్తి మహిళా గ్రూపులకు బ్యాంకు లింకేజీ లక్ష్యాల మేరకు రుణాల పంపిణీ, వసూళ్లు, ఎన్‌పీఏ వసూళ్లు, సీబీఆర్‌ఎం టీమ్స్ ఏర్పాటు చేయడంపై చర్చించారు. ఆన్‌లైన్‌లో ఎంసీపీలను మాత్రమే అనుమతించాలని బ్యాంకర్లకు సూచించారు. ఇందిరా మహిళాశక్తి, పీఎంఎస్‌వీ, ఇతర సంక్షేమ పథకాల ద్వారా ఇచ్చే రుణాలు, ఎంసీపీల టార్గెట్లు, అచీవ్‌మెంట్లపై చర్చించారు. సమావేశాల్లో డిప్యూటీ కమిషనర్ సువార్త, ఎస్‌ఈ, లీడర్ బ్యాంక్ మేనేజర్, ట్రాఫిక్ ఏసీపీ, మెప్మా టీఎంసీ, ఎంసీ, హాకర్ ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 26: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీ ఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్-17 బాల బాలికల వాలీబాల్ పోటీలను శుక్రవారం నిర్వహించనున్నారు. ఇల్లందకుంట మండలం సిరిసేడు జిల్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో పోటీలను నిర్వహించనున్నామని సమాఖ్య కార్యదర్శి వేణు గోపాల్ తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన మండల జట్లు మండల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, కన్వీనర్ల సంతకంతో కూడిన అర్హత ధ్రువ పత్రాలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 94404 58494 నంబరులో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల భాషా సామర్థ్యం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

సైదాపూర్, సెప్టెంబరు 26: పాఠశాలల్లో విద్యార్థుల భాషా సామర్థ్యాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో జరిగిన ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభను గుర్తించి విద్యార్థులు అన్ని రంగాల్లో ఎదిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలని, ప్రతీ పాఠశాలలో విధిగా లైబ్రరీ పీరియడ్ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, నోడల్ అధికారి రవీంద్రాచారి, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోతె కాలువకు మోక్షం

నేడు గుమ్లాపూర్‌లో కాలువ-2 పనులు ప్రారంభం



వరద కాలువ

చొప్పదండి, సెప్టెంబరు 26: నియోజకవర్గంలోని మెట్ట ప్రాంతాలకు నీరు అందించే మోతె కాలువలకు మోక్షం లభించింది. రైతుల నిరీక్షణకు తెరపడింది. మోతె రిజర్వాయర్‌కు ప్రత్యామ్నాయంగా వరద కాలువలకు నాలుగు తూములను ఏర్పాటు చేసి కాలువల ద్వారా సాగు నీటిని అందించాలని ఏడేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. కాలువల నిర్మాణానికి భూసేకరణ పూర్తి చేయగా పనులను చేపట్టాలని గతంలో అనేక సార్లు రైతులు ఆందోళన చేపట్టారు. నాలుగేళ్ల క్రితం 248 కోట్ల రూపాయలను మంజూరు చేయగా పనులను ప్రారంభించలేదు. చొప్పదండి, రామడుగు మండలాల్లోని మెట్ట ప్రాంతలకు సాగు నీటి కోసం నిర్మించే కాలువ-2కు శుక్రవారం మండ లంలోని గుమ్లాపూర్‌లో పనులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించనున్నారు.

తొమ్మిది గ్రామాలకు సాగు నీరు

మోతె కాలువ-2 ద్వారా 14,744 ఎకరాలకు సాగునీరు అందుతుంది. చొప్ప దండి మండలంలోని ఆర్నకొండ, చిట్యాలపల్లి, చొప్పదండి, గుమ్లాపూర్, కాట్నపల్లి, కొలిమికుంట, కోసేరుపల్లి, రాగంపేట, రుక్మాపూర్, రామడుగు మండలంలోని లక్ష్మీపూర్, మోతె, రామడుగు, రుద్రారం, షానగర్, కోరుటపల్లి, దత్తోజీపేట గ్రామాల్లోని భూములకు సాగు నీరు అందుతుంది. మోతే-2 కాలువ 12 కిలోమీటర్ల మేర ఉంటుంది. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ వద్ద వరద కాలువకు తూము ఏర్పాటు చేసి అక్కడి నుంచి రామడుగు, కొరటపల్లి, దత్తోజి పేట, రంగశాయిపల్లి, గుమ్లాపూర్ మీదుగా లక్ష్మీసైర్ వరకు కాలువ నిర్మిస్తారు. ఎనిమిది చోట్ల డిస్ట్రిబ్యూటర్ కాలువలు నిర్మించి సాగు నీరు సరఫరా చేస్తారు.



పనులు ప్రారంభించే స్థలం

ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 26: ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నది ఉద్యోగులేనన్నారు. ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై వారు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. పెండింగ్ బిల్లులతో పాటు సీపీఎస్‌ను రద్దు చేసి జూలై 1, 2024 నుంచి పీఆర్సీని అమలు చేయాలని కోరారు. అనేక సమస్యలతో ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ ఉద్యోగులు అనేక రకాలుగా సమస్యలతో సతమతమవుతున్నారని, వారి సమస్యల పరిష్కారానికి పాత పింఛన్ విధానాన్ని ప్రవేశ పెట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన 79 జీవో ప్రకారం కలెక్టర్ యుద్ధ ప్రతిపాదికన కారణ్య నియామకాలు చేపట్టాలని, ఆయా కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జూలై 1 నుంచి పీఆర్సీని అమలు చేసి మానిటరింగ్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. ఇప్పటికే ఉద్యోగులు రెండు పీఆర్సీలు నష్టపోయారని తెలిపారు. స్వరాష్ట్రంలో న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల భాగస్వామ్యంలో నగదు రహిత వైద్యం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగుల జీతభత్యాలు ఈ కుబేర్ ద్వారా కాకుండా పాత పద్ధతి ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని యూనిట్ల, డిపార్ట్‌మెంట్ల ఫోరం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు తీర్మానాలు ప్రవేశ పెట్టగా సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికైన రవీందర్‌రెడ్డి, కేంద్ర సంఘం నాయకులుగా బాధ్యతలు స్వీకరించిన రాగి శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కోట రామస్వామి, కార్యదర్శి శంకర్‌లతోపాటు పదవి విరమణ పొందిన రాజమహేందర్, కిషన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాగుల నరసింహస్వామి, ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇరుమల్ల శారద, సర్దార్ హర్విందర్‌సింగ్, వెలిచాల సుమంత్‌రావు, మారుపాక రాజేష్, భరద్వాజ్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం ఘటనపై వీడియో వైరల్

- ఎస్సై వేధింపులే కారణమంటూ బంధువుల ఆరోపణ - విచారణ చేపట్టిన పోలీస్ శాఖ?

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 26: కుటుంబ కలహాలతో ఈనెల 23న జగిత్యాల జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన బొల్లారపు శివప్రసాద్ అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కోరుట్ల ఎస్సై దాడి చేయడంతోనే తన సోదరుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రశాంతి ఆరోపిస్తోంది. ఈ ఘటనపై శివప్రసాద్ సోదరి ప్రశాంతి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి నుంచి విడుదల చేసిన వీడియో బుధవారం నుంచే జగిత్యాల జిల్లాలో వైరల్ అవుతోంది.

శివప్రసాద్‌కు తన భార్యకు మధ్య వివాదం జరగడంతో ఈనెల 22న కోరుట్ల పోలీసులు ఫిర్యాదు మేరకు శివప్రసాద్‌ను పిలిపించారు. ఆ మరుసటి రోజే శివకుమార్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అయితే ఎస్సై దాడి చేయడంతోనే ఈ ఘటన జరిగినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు విడుదల చేసిన వీడియో కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీస్ శాఖ విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ నెల 22న కోరుట్ల పోలీస్ స్టేషన్ లో అసలు ఏమి జరిగింది అనే కోణంలో పోలీస్ అధికారి విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు సమాచారం.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, సెప్టెంబరు 26: నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని దాచారం గ్రామానికి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ గురువారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామం నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసినట్లు పేర్కొన్నారు. అంకుసాపూర్ గ్రామానికి చెందిన గౌరవేని రాజును రిమాండ్‌కు తరలించినట్లు, ట్రాక్టర్‌ను సీజ్‌చేసినట్లు తెలిపారు

ఎల్లారెడ్డిపేటలో చోరీ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 26: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిష్టంపల్లిలో తాళం వేసి ఉన్న మొగుళ్ల మల్లేశం ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. తాళం బద్దలు కొట్టిన చోరులు లోనికి ప్రవేశించి బీరువాలను ధ్వంసం చేశారు. బీరువా తెర చుకోకపోవడంతో అక్కడ నుంచి జారుకున్నారు. మండల కేంద్రంలో ఇంటి ఎదుట నిలిపిన ఎర్రవెళ్లి కృష్ణకు చెందిన ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారు. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ఎస్‌యూలో సమస్యలను పరిష్కరించాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 26: ఎస్‌యూ సమస్యలను పరిష్కరించాలని ఇన్‌చార్జి ఉపకులపతి సురేంద్ర మోహన్‌కు ఏబీవీపీ శాతవాహన యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. యూనివర్సిటీలోని 14 కోర్సుల్లో ఎనిమిది కోర్సులు సెల్ఫ్‌ఫైనాన్స్‌గా ఉండడం వల్ల బడుగుబలహీన వర్గాల విద్యార్థులు ఫీజులు కట్టలేక పోతున్నారన్నారు. కోర్సులని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బందిని వెంటనే నియమించాలన్నారు. విశ్వవిద్యాలయంలో 114మంది సిబ్బంది అవసరం ఉంటే కేవలం 63 మంది సిబ్బందితో నడుపుతున్నారన్నారు. సరైన విద్య అందక విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. పూర్తిస్థాయిలో రెగ్యులర్ బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ జెల్లపెల్లి అంజన్న యూనివర్సిటీ నాయకులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

వలస కూలీ మృతిపై కేసు నమోదు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 26: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి జనగామలోని ఓ ఇటుక బట్టీలో పనిచేస్తున్న నిరంజన్‌సింగ్ బోరియా మృతిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఒడిస్సాకు చెందిన నిరంజన్ సింగ్ బోరియా నెల రోజుల క్రితం ఇటుక బట్టీలో పనిలో చేరాడు. బుధవారం మధ్యాహ్నం జయకుమార్ అనే తోటి కూలీతో కలసి నదిలో చేపలు పట్టుకుని వంట చేసుకుని తిన్నారు. కాసేపటికి వాంతులు, విరోచనాలు కావడంతో ఇటుక బట్టీ నిర్వాహకులు గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నిరంజన్‌సింగ్ బోరియా బుధవారం అర్ధరాత్రి మరణించాడు. మృతుడి బంధువు దుర్యోదన్ బోరియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఆహారం కలుషితం కావడమే లేక ఇతర కారణాలతో నిరంజన్‌సింగ్ మరణించాడా అనేది విచారణ తర్వాత స్పష్టత వస్తుందని పోలీసులు తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

జూలపల్లి, సెప్టెంబరు 26. మండల కేంద్రానికి చెందిన అమరగాని చంద్రయ్యగౌడ్ అనే గీత కార్మికుడు ఈతచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగ గాయపడ్డాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వృత్తిలో భాగంగా బుదవారం ఈత చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోవడంతో వెన్నుపూసకు దెబ్బ తగిలి తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి ఆదుకోవాలని మండల గీతకార్మిక, గౌడ సంఘం నాయకులు కోరారు.

నేడు విద్యార్థి గర్జన సభ

గణేశ్‌నగర్, సెప్టెంబరు 26: హైదరాబాదులో శుక్రవారం నిర్వహించనున్న విద్యార్థి గర్జనసభ పోస్టర్లను భారత విద్యార్థి ఫెడరేషన్ కరీంనగర్ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టౌన్ అధ్యక్షుడు ఎల్కటూరి ఇషాక్ గురువారం మాట్లాడారు. సంక్షేమ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలను మూడువేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 16 మండలాలు ఉంటే ఏ ఒక్క మండలానికి కూడా రెగ్యులర్ ఎంఈవో లేని పరిస్థితి ఉందన్నారు. ఇన్‌చార్జి ఎంఈవోలే ఉన్నారన్నారు. ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాల హాస్టల్స్‌లో దాదాపు అద్దె భవనంలో అరకొర వసతులతో అనేక ఇబ్బందులు పడుతూ కొనసాగుతున్నాయన్నారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకి పెరిగిపోతున్నా సంక్షేమ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచడం లేదన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ నెల 27న హైదరాబాదులో జరిగే విద్యార్థి గర్జన సభను జయప్రదం చేయాల్సిందిగా విద్యార్థులను మేధావులను కోరారు. ఈ కార్యక్రమంలో విష్ణు, రమేష్, భాను చందు, మర్రి శంకర్, శ్రీను, భారత్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి నదిలో యువకుడి గల్లంతు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 26: గోదావరి నదిలో గురువారం సుదర్శి బాలరాజు(29) అనే తాపీ మేస్త్రీ గల్లంతయ్యాడు. తనతో నిర్మాణ పనులు చేసే ఇద్దరు మేస్త్రీలతో కలసి నదీ స్నానానికి వచ్చాడు. సమ్మక్క గద్దెల సమీపంలో ప్రమాదవశాత్తు బాలరాజు జారి నదిలో పడడంతో కొట్టుకుపోయాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన బాలరాజు కొద్ది కాలంగా స్థానిక కేసీఆర్ కాలనీలో నివాసం ఉంటు స్థానికంగా భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తున్నాడు.

మహిళను రక్షించిన అగ్నిమాపక దళ సిబ్బంది



హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 26: మండలంలోని సిర్సపల్లి గ్రామంలో గురువారం మతిస్థిమితం లేని ఓ మహిళ బావిలో దూకగా, అగ్నిమాపకదళ సిబ్బంది కాపాడారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సిర్సపల్లికి చెందిన మన్యాల శారద మతిస్థిమితం లేక గ్రామంలో పేద బావిలో దూకింది. స్థానికులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని బావిలోకి దూకి శారదను ప్రాణాలతో కాపాడారు. మహిళను కాపాడిన ఫైర్ సిబ్బంది శ్రీనివాస్, ప్రభాకర్, సందీప్, అనిల్‌కుమార్, శివారెడ్డిలను గ్రామస్థులు అభినందించారు.

ఎస్‌యూలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 26: ఎస్‌యూలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్‌ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీలో ఇన్‌చార్జి వీసీ అధికారి సురేంద్ర మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ఎత్తివేసి రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కిన్నెర క్రాంతి, శివ, ప్రవీణ్, జగన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

29న కొండగట్టులో ఆలయాల అర్చకులకు సన్మానం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 26: బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొండగట్టులోని బృందావనం ఫ్యామిలీ రిసార్ట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చాగోష్ఠితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన పలు ఆలయాల అర్చకులకు సన్మానం నిర్వహిస్తున్నట్లు వేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ ఉజ్వల, రిసార్ట్ అధినేత మర్రిపెల్లి కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బాల శ్రీనివాసులు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తత్వం చారిటబుల్ ట్రస్టు అధినేత బంగారయ్యశర్మ, అతిథులుగా బిర్లామందిర్ ప్రధానార్చకుడు ఎం లక్ష్మీనరసింహాచార్యులు, దర్శనం మాసపత్రిక సంపాదకుడు మారుమాముల వేంకటరమణశర్మ, వేద, పురాణ, ఇతిహాస, ప్రవచన పండితులు పురాణం మహేశ్వరశర్మ, నంబి వేణుగోపాలాచార్యుల కౌశిక, రిసార్ట్ ఎండి కొండలరావు, ఏబీ6 న్యూస్ ఛానల్ డైరెక్టర్ విష్ణుదాస్ శ్రీకాంత్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ వ్యాపారాలు చేసే బ్రాహ్మణ కుటుంబాల వారిచే స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు, ఔత్సాహికులు సెల్. 7382171021, 9059550280 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఉమ్మడి జిల్లా బ్రాహ్మణ సమాజ బంధువులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో తనిఖీలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 26: సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో సివిల్ సప్లయిస్ విజిలెన్స్ ఇన్ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాల్లో ఇటీవల రేషన్ దుకాణాల డీలర్ల నియామకాల్లో అవకతవకలు జరగాయని సివిల్ సప్లయిస్ కమిషనర్‌కు ఫిర్యాదు రావడంతో కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది.

ఇసుక లారీల పట్టివేత

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 26: జమ్మికుంట మండలం తనుగుల పరిధిలోని మానేర్ నుండి ఇసుక లోడులతో వస్తున్న నాలుగు లారీలను శంబునపల్లి గ్రామంలో పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ గురువారం రాత్రి పట్టుకున్నారు. లారీలను స్వాధీనం చేసుకోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ముగ్గురు డ్రైవర్లను అదుపులోకి తీసుకోని విచారిస్తున్నారు.

ఇసుక తరలిస్తున్న వాహనం సీజ్

సుల్తానాబాద్, సెప్టెంబర్ 26: సుల్తానాబాద్ మండలంలోని కదంబాపూర్ గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ వాహనాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి వద్ద ఓ వాహనంలో సంచుల్లో నింపి ఉన్న బ్యాగులను రవాణా చేస్తుండగా తాము పట్టుకున్నామని ఆయన తెలిపారు. ఈ మేరకు వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మానేరు నుంచి ట్రాక్టర్ల ద్వారా పలు చోట్ల డంపులు ఏర్పాటు చేసుకుని ఆ ఇసుకను జల్లెడ పట్టించి 25 నుంచి 30 కిలోల బ్యాగుల్లో నింపి ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు నిజామాబాద్, వరంగల్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారనే విషయం బయటపడిందని తహసీల్దార్ తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు భారీగా వరద

- 22 గేట్లు ఎత్తిన అధికారులు



దిగువకు దూకుతున్న శ్రీరాంసాగర్ నీరు

జగిత్యాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరద నీరు భారీగా వస్తోంది. దీంతో ప్రాజెక్టుకు చెందిన 22 వరద గేట్లు ఎత్తి 81,224 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 1,09,214 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అదుపు తప్పి ఇసుక లారీ బోల్తా

మంథని, సెప్టెంబర్ 26: మున్సిపల్ పరిధిలోని గంగాపురి గ్రామ శివారులో మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి పక్కన ఇసుక లారీ అదుపు తప్పి గురువారం బోల్తా పడింది. మండలంలోని అడవిసోమన్‌పల్లి ఇసుక క్వారీ నుంచి కరీంనగర్‌కు లోడ్‌తో వెళ్తున్న లారీ గంగాపురి సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్న కారణంగానే ఈప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు వెల్లడించారు. స్థానికులు లారీ క్యాబిన్ చిక్కున్న డ్రైవర్‌ను బయకు తీశారు. డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి.

వాటర్ ట్యాంక్ ఎక్కి పాత రేషన్ డీలర్ల ఆందోళన



వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళన చేస్తున్న పాత రేషన్ డీలర్లు, పెట్రోల్ బాటిల్‌తో పాత మహిళ రేషన్ డీలర్లు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 26: తమ రేషన్ దుకాణాలు తమకివ్వాలని దాదాపు 30 మంది పాత రేషన్ డీలర్లు గురువారం జిల్లా కేంద్రంలోని సాయినగర్ మున్సిపల్ వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళన చేపట్టారు. పోలీసులు వాటర్ ట్యాంక్‌పైకి రావాలని చూస్తే ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని ఇద్దరు మహిళా డీలర్లు హెచ్చరించారు. విషయం తెలుసుకున్న అడి షనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల తహసీల్దార్ షరీఫ్ అహ్మద్ బుజ్జగించే ప్రయ త్నం చేశారు. కేవలం పాత్రికేయులు పైకి వెళ్లడానికి బాధితులు ఒప్పుకున్నారు. వాటర్ ట్యాంక్‌పైకి చేరిన పాత్రికేయులతో డిమాండ్లను వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో సిరిసిల్ల పట్టణం, గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో 58 రేషన్ దుకాణాలతో పదేళ్లుగా పనిచేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. తమకు సమాచారం లేకుండా దుకాణాలకు నోటిఫికేషన్ వేశారన్నారు. అనర్హులకు అధికార పార్టీ నాయకులు, అధికారులు రేషన్ దుకాణాలను ఇస్తున్నారని ఆరోపించారు. డబ్బులు తీసుకొని ఇచ్చి తమకు అన్యాయం చేశారని పాత మహిళా డీలర్లు కన్నీరు పెట్టుకున్నారు. డబ్బుల కోసమే తమ రేషన్ దుకాణాలను తమకుకాకుండా చేస్తే ఆ నాయకులకు, ఆ అధికారులకు బిచ్చమెత్తైన డబ్బులు ఇస్తామని, దుకాణాలు ఇవ్వండని వేడుకున్నారు. కలెక్టర్ స్పందించి తమ దుకాణాలు తమకివ్వాలన్నారు. కలెక్టర్, ఆర్డీవోతో మాట్లాడతామని పోలీసు ఆధికారులు, తహసీల్దార్ నచ్చజెప్పడంతో వాటర్ ట్యాంక్ దిగి వచ్చారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

మాజీ మంత్రి కేటీఆర్‌కు గోడు వెళ్లబోసుకున్న బాధితులు

- మంత్రి ఉత్తమ్‌కు ఫోన్

సిరిసిల్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ దుకాణాల కేటాయింపు వివాదం చర్చనీయాంశంగా మారింది. 54 దుకాణాలకు సంబంధించి రాత పరీక్షలు నిర్వహించి, ఇంటర్వ్యూలు జరిపినా కేవలం కాంగ్రెస్ సంబంధిచిన వారికే అడ్డదారిన ఇచ్చారనే దానిపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో గురువారం జిల్లాకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుకు బాధితులు గోడు వెళ్లబోసుకన్నారు. సిరిసిల్లలోని జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బాధితులు కేటీఆర్‌ను కలుసుకున్నారు. గతంలో మహిళ సంఘాల ద్వారా నిర్వహించిన వాటిని తొలగించిన విషయంతో పాటు అర్హతలు లేనివారికి కేటాయించడం ఇతర అవకతవకలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కేటీఆర్ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఫోన్ చేసి జరిగిన అవకతవకలపై వివరిం చారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి పరిశీలిస్తామని చెప్పారు. కేటీఆర్ సిరిసిల్ల ఆర్డీవోకు ఫోన్ చేయగా అయన ఫోన్ ఎత్తలేదు. ఆర్డీవో కార్యాలయంలోనే రేషన్ దుకాణాలపైనే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలపై మాజీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. దానిపై కేటీఆర్ బాధితులతో హైకోర్టులో పిటిషన్ వేసే విషయంపై చర్చించారు. న్యాయ పోరాటం చేస్తామని ఎవరినీ వదిలేదిలే దని తెలిపారు. ధైర్యంగా ఉండాలని సూచించారు.



కేటీఆర్‌కు సమస్యను చెప్పుకుంటున్న బాధితులు

రామగుండం ఎన్టీపీసీకి

మూడు జాతీయ స్థాయి అవార్డులు

- ఇంధన పొదుపు, పవర్ ఎక్స్‌లెన్స్‌లో ఎకనామిక్ టైమ్స్ నుంచి పురస్కారం



అవార్డు అందుకుంటున్న ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు

జ్యోతినగర్, సెప్టెంబరు 26: రామగుండం ఎన్టీపీసీకి ఎనర్జీ కన్‌జర్వేషన్(ఇంధన పొదుపు), పవర్ ఎక్స్‌లో మూడు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. ప్రముఖ పబ్లికేషన్స్ సంస్థ ది ఎకనామిక్ టైమ్స్ ప్రతి ఏటా విద్యుత్ సంస్థలకు అవార్డులను అందజేస్తున్నది. దీనిలో భాగంగా బుధవారం రాత్రి ఢిల్లీలో జరిగిన ఎకనామిక్ టైమ్స్ ఎనర్జీ లీడర్‌షిప్ అవార్డ్స్ 2024 కార్యక్రమంలో రామగుండం ఎన్టీపీసీకి అందజేసింది. ఇంధన ఎదుపు అవార్డు(ఇండస్ట్రీస్), ఎనర్జీ కంపెనీ అవార్డు(పవర్), ఎనర్జీ కంపెనీ అవార్డులను(రిన్యూవబుల్) కేంద్ర ఇంధన శాఖ క్యాబినెట్ మంత్రి ప్రహ్లాద్ జోషి రామగుండం ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాడుకు అందజేశారు. విద్యుత్ రంగంలో ఘననీయమైన చరిత్ర ఉన్న రామగుండం ఎన్టీపీసీకి మరోసారి జాతీయస్థాయి పురస్కారాలు రావడంపట్ల ప్రాజెక్టులో హర్షం వ్యక్తం అవుతున్నది. నాలుగున్నర దశాబ్దాలుగా ప్రాజెక్టు పలు రంగాల్లో అత్యుత్తమంగా పని చేయడం ద్వారా అనేక బెంచ్‌మార్కులను, రికార్డులను నమోదు చేసింది. ఇంధన పొదుపు, జనరేషన్, సాంప్రదాయేతర విద్యుత్, పర్యావరణం తదితర రంగాల్లో అవార్డులు సాధిస్తున్నది.

3 నుంచి రాజన్న ఆలయంలో దేవీ నవరాత్రోత్సవాలు

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



విగ్రహాలను శుద్ధి చేస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 26 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఆక్టోబరు 3వ తేది శనివారం నుంచి దేవినవరాత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయంలో గురువారం శ్రీదేవినవరాత్రోత్సవాలకు మండపం ఏర్పాట్లు చేస్తున్నారు. రాజన్న ఆలయంలో శ్రీదేవినవరాత్రోత్సవాలు ఆక్టోబరు 3వ తేది శనివారం నుంచి 12వ తేది శనివారం వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 9వ తేది బుధవారం రోజున ఉదయం 9 గంటలకు మూలా నక్షత్ర పుస్తకరూపిణి మహాసరస్వతి పూజ, 10 తేది గురువారం రోజున దుర్గాష్టమిని పురష్కరించుకుని ఉదయం 8.30 గంటలకు నుంచి చండీ అమ్మవారి వద్ద శ్రీచండీకలశప్రతిష్ట, చండీ సప్త శతీ హవనము చేపట్టగా రాత్రి 8 గంటలకు శ్రీమహిషాసురమర్దినీ అమ్మవారికి మహాపూజ జరగనున్నాయి. 11వ తేది శుక్రవారం రోజున ఉదయం 11.05 గంటలకు పూర్ణహుతి, బలిహరణ రాత్రి 8.30 గంటలకు నుండి అమ్మవారిక ధర్మగుండంలో తెప్పోత్సవము నిర్వహించనున్నారు. 12వ అది శనివారం రోజు విజయదశమి (దసరా)ను సందర్భంగా ఉదయం 10.45 గంటలకు ఆలయుధపూజ, సాయంత్రం 5 గంటలకు నుంచి స్వామి వారి పెద్దసేవ (అంబారీ సేవ)ను, స్వామి వారి అమ్మవార్ల శమీపూజ, అపరాజిత పూజ చేపట్టానున్నారు. శ్రీదేవినవరాత్రోత్సవాలతో ప్రతినిత్యం సాయంత్రం 4 గంటలకు శ్రీమత్ దేవీభాగవత పురాణ ప్రవచనము నిర్వహించడంతో పాటు స్వామి వారికి నిత్య కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రోగి బంధువుపై ఆసుపత్రి సిబ్బంది దాడి?

- కలెక్టర్‌తో పాటు పోలీస్, వైద్య శాఖ అధికారులకు ఫిర్యాదు

జగిత్యాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఓ రోగి బంధువుపై ఆసుపత్రి సిబ్బంది దురుసుగా ప్రవర్తించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రా నికి చెందిన కుందారపు గంగాధర్ అనారోగ్యానికి గురి కావడంతో అతని కుమారుడు నరేష్ జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించాడు. చికిత్స అందించే విషయంలో వైద్యులతో పాటు సిబ్బంది అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణతో నరేష్ పలు ఘటనలను తన ఫోన్‌లో వీడియో ద్వారా బుధవారం రాత్రి చిత్రీకరించాడు. దీంతో సదరు వీడియోలను డిలీట్ చేయాలని కోరుతూ కింది స్థాయి సిబ్బంది ఒకరు నరేష్‌పై దాడికి పాల్పడ్డట్లు బాధితుడు కలెక్టర్‌తో పాటు పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై ఆసుపత్రి సూపరింటెండెంట్ రాములును వివరణ కోరగా ఫిర్యాదు అందిన విషయం వాస్తవమేనని, ప్రాథమికంగా విచారణ చేశామని, రోగి బంధువు, సంబంధిత సిబ్బంది మధ్య పాత గొడవలున్నట్లుగా తెలుస్తోందని స్పష్టం చేశారు. మరింత లోతుగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎఫ్‌టీఎల్‌లోని కట్టడాలకు కార్పొరేషన్ అధికారుల నోటీసులు

- తమ తప్పేమిలేదంటున్న నిర్మాణదారులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 26: రామగుండం నగరపాలక సంస్థ 5వ డివిజన్ పరిధిలోని మల్లపురాణి కుంట ఎఫ్‌టీఎల్‌లో 16 భవనాలకు గురువారం నగరపాలక సంస్థ అధికారులు నోటీసులు జారీ చేశారు. అదనపు కలెక్టర్(రెవెన్యూ) ఆదేశానుసారం నోటీసులు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఇటీవల రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సంయుక్త సర్వే చేసి మల్లపురాణికుంటకు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను నిర్ధారించారు. 16 నిర్మాణాలు ఎఫ్‌టీఎల్‌లో ఉండగా 36 నిర్మానాలు శిఖంలో ఉన్నాయి. శిఖంలో ఉన్న నిర్మాణాలను తొలగించుకోవాలని ఇప్పటికే కార్పొరేషన్ సమాచారం ఇచ్చింది. గురువారం ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలకు నోటీసులు ఇచ్చారు. కాగా బఫర్ జోన్‌లో కూడా చాలా నిర్మాణాలు ఉన్నాయి. ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలకు నోటీసులు ఇవ్వగా వినాయకనగర్ వాసులు కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులను సంప్రదించారు. తాము నిర్మించుకున్న నివాసాలకు గతంలో రెవెన్యూ నాలా కన్వర్షన్ ఇచ్చిందని, ఇరిగేషన్ ఎన్‌ఓసీలు ఇచ్చిందని, మున్సిపల్ కార్పొరేషన్ పర్మిషన్లు ఇచ్చిందని, అలాంటప్పుడు మా తప్పు ఎలా అవుతుందంటూ పేర్కొన్నారు. కాగా నోటీసులకు రాతపూర్వక సమాధానం ఇవ్వాలని, తాను అధికారులకు నివేదిస్తానని టీపీఎస్ నవీన్, నిర్మాణదారులతో పేర్కొన్నారు. కాగా మల్లపురాణికుంట శిఖం భూముల్లోని నిర్మాణదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో నాలా ఆక్రమణలు, చెరువుల ఆక్రమణలపై పరిశీలన జరిపారు. త్వరలోనే యాక్షన్ ప్లాన్ చేపడుతారనే ప్రచారం జరుగుతున్న సందర్భంలో నోటీసులు కలకలం రేపాయి. వినాయక నగర్ ఎఫ్‌టీఎల్ నిర్మాణ బాధితుల్లో పోలీస్‌శాఖకు చెందిన పలు కుటుంబాలు ఉన్నాయి.



కార్పొరేషన్ టీపీఎస్‌తో మాట్లాడుతున్న వినాయకనగర్ వాసులు

జెన్‌కో ద్వారానే విద్యుత్‌కేంద్రం నిర్వహించాలి



నిరసన తెలుపుతున్న విద్యుత్ జేఏసీ నాయకులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 26: సింగరేణికి నూతన ప్రాజెక్టులో భాగస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ, జెన్‌కో ద్వారానే విద్యుత్ కేంద్రం నిర్మించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ సర్కిల్ కార్యలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగుండంలో జెన్‌కో ద్వారా నిర్వహించిన 62.5 మెగావాట్ల పాత థర్మల్ విద్యుత్ కేంద్రం మూసివేయడానికి నిర్ణయించారన్నారు. దాని స్థానంలో నూతనంగా 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సింగరేణి, జన్‌కో భాగస్వామ్యంతో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. నూతన విద్యుత్ కేంద్రాన్ని పూర్తిగా జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించాలని ఉద్యోగకార్మిక సంఘాలు కోరుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో కరీంనగర్ జేఏసీ నాయకులు నాయిని అంజయ్య, వీరయ్య, సంపత్ కుమార్, శ్రీనివాస్, జనార్దన్, స్వామి, సుధీర్ కుమార్, కిరణ్ ఇతర నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కొత్త చెరువు నాలాలపై

ఆక్రమణలను తొలగించాలి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 26 : సిరిసిల్ల కొత్త చెరువు నాళాలు, శాంతినగర్ రొడ్డం ఆక్రమణాలను తొలగించాలని గురువారం ఏఐఎఫ్టీయూ (న్యూ)నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్టీయూ(న్యూ)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలో కొత్త చెరువుకు సంబంధించిన నాళాలు, రొడ్డం 16 సంవత్సరాలుగా ఆక్రమణాలకు గురవుతున్నాయన్నారు. తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు రవీందర్, ఎర్రజెండా పవర్ లూం కార్మిక సంఘం జిల్లా నాయకుడు బొద్దుల శ్రీహరి, పట్టణ నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

క్రైం కార్నర్

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కొడిమ్యాల, సెప్టెంబరు 26: మండలంలోని సూరంపేట గ్రామానికి చెందిన నక్క సాయి(25)మద్యానికి బానిసై గురువారం తెల్లవారుజామున ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు సాయి మద్యానికి బానిసయ్యాడు. దీంతో పాటు ఆర్థిక సమస్యలు ఏర్పడటంతో అతడి భార్య ఏడాది క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. అనస్థాపానికి గురైన సాయి ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. సాయి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ట్లు ఎస్సై వివరించారు. ఇదిలా ఉండగా తన చావుకు ఎవరూ కారణం కాదని, మద్యానికి బానిసై అందరినీ బాధపెట్టానని తనను క్షమించాలని రాసిన సూసైడ్ నోట్ ఇంట్లో లభించింది.

కారు కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 26: కారుకొనివ్వలేదని ఇంట్లోనుంచి పారిపోయి వచ్చి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామశివారులో చోటుచేసుకుంది. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండలం రాగిల్ల గ్రామానికి చెందిన దేతపు వంశీ (20) కారు కొనివ్వాలని ఇంట్లో తరచూ తల్లిదండ్రులను అడిగేవాడు. కారు కొనివ్వకపోవడంతో వంశీ మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఈనెల 23న ఇంటి నుంచి వెళ్లిన వంశీ కనిపించకుండా పోయాడు. గురువారం జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ శివారులోని గుట్టప్రాంతంలో వంశీ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించడంతో విషయం తెలిసింది. మృతుడి తండ్రి రాజలింగు ఫిర్యాదు మేరకు కేసు ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం

- ఒకరికి తీవ్రగాయాలు

ముత్తారం, సెప్టెంబర్ 26: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా వెళ్తున్న ద్విచక్ర వాహనానికి ఒక్కసారిగా కోతి అడ్డం రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. కమాన్‌పూర్ మండలానికి చెందిన బూడ రాజు అనే వ్యక్తి ముత్తారం మండల కేంద్రంలో విద్యుత్తు లైన్ల సవరణలో కాంట్రాక్టు లేబర్‌గా విధులు నిర్వహించి తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తుండగా ఈ సంఘటన జరిగిందని బాధితుడు తెలిపాడు. తలకు తీవ్రగాయాలు కాగా అక్కడే ఉన్న కానిస్టేబుల్, స్థానికులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి మూడేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 26: హత్యాయత్నం కేసులో ముగ్గురు రౌడీ షీటర్లకు మూడేళ్ల జైలు శిక్ష రూ. 1000జరిమానా విధిస్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సబ్ కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ గురువారం తీర్పు వెల్లడించారు. ప్రాషిక్యూషన్ వివరాల ప్రకారం.... చందుర్తి మండలంలోని అశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంచ రాంరెడ్డి అనే వ్యక్తికి అదే గ్రామానికి చెందిన కట్కూరి స్వామి, గంగుల శ్రీను, చింత శేఖర్‌లకు బావి పంచాయతీ విషయంలో తరుచు గొడవలు తలెత్తాయి. ఈ గొడవల్లో భాగంగా రాంరెడ్డిని చంపాలనే ఉద్దేశ్యంతో స్వామి, శ్రీను, శేఖర్‌లు కర్రతో దాడిచేశారు. ఈ దాడిపై బాధితుడు రాంరెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు అప్పటి చందుర్తి ఎస్ఐ నీలం రవి కేసు నమోదుచేసి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సిఎంఎస్ ఎస్ఐ రవిందర్‌నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్‌లు తిరుపతి, లతీఫ్, సిఎంఎస్ హెడ్‌కానిస్టేబుల్ శంకరయ్య, కానిస్టేబుల్ మధులు 11మంది సాక్షులను ప్రవేశపెట్టగా పిపి వేముల లక్ష్మీప్రసాద్ వాదించగా కేసు పూర్వపరాలు పరిశీలించిన అసిస్టెంట్ సబ్‌కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్ నిందితులపై నేరం రుజువు కావడంతో ముగ్గురికి ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

సింగరేణి కార్మికుడి ఆత్మహత్యాయత్నం

కోల్‌సిటీ, సెప్టెంబరు 26: గోదావరిఖని గాంధీనగర్‌లో పొరిగింటివారితో వివాదం కారణంగా కోరె శంకర్ అనే సింగరేణి కార్మికుడు గురువారం సాయంత్రం విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పొరిగింటి వారితో వివాదంలో మహిళ శంకర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శంకర్ కూడా ఆమెపై ఫిర్యాదు చేశాడు. ఈ వివాదంలో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసినట్టు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

పనిలో నుంచి తొలగించారని మెడికల్ కళాశాల కార్మికుడు..

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 26: తనపై అకారణంగా కేసు పెట్టి విధుల నుంచి తొలగించారంటూ గోదావరిఖనిలోని సింగరేణి మెడికల్ కళాశాలలో గురువారం మసూద్ అనే కార్మికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాంట్రాక్టర్ తరుణ్ మెడికల్ కళాశాలకు రాగా మసూద్ అతనితో వాగ్వాదానికి దిగి విషం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అతడు గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

గంజాయి పట్టివేత: నలుగురు నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 26: కరీంనగర్ శివారులోని రేకుర్తిలో గురువారం నిర్వహించిన దాడుల్లో 223 గ్రాముల నిషేధిత గంజాయి పట్టుబడిందని కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో ఈ దాడులు నిర్వహించగా నలుగురు నిందితులు పట్టుబడ్డారని తెలిపారు. గంజాయి, రెండు మొబైల్ ఫోన్లను సీజ్ చేశామన్నారు. చింతకుంటకు చెందిన నెలమడుగు హరీష్, ధర్మారం రవి, చొప్పదండి మండలం భూపాలపట్నంకు చెందిన మాచర్ల రవితేజ, రేకుర్తి గ్రామానికి చెందిన షేక అఫ్జల్‌పై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామన్నారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్ల ఖాసీంబి, కమలాకర్, సంతోష్, కమాలుద్దీన్ పాల్గొన్నారు.

హై వోల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

కోల్‌సిటీ, సెప్టెంబరు 26: విద్యుత్‌లైన్లపై చెట్ల కొమ్మలు తొలగించడంలో ఎన్‌పీడీసీఎల్ నిర్లక్ష్యం కారణంగా రెండు రోజుల క్రితం ఎఫ్‌సీఐ గౌతమినగర్ చిల్డ్రన్స్ పార్క్ ఏరియాలో హై వోల్టేజీ సరఫరా అయ్యింది. దీంతో 24 ఇళ్లలోని టీవీలు, ఫ్రిడ్జ్‌లు, ఇతర విలువైన గృహోపకరణాలు కాలిపోయాయి. గౌతమినగర్ హౌసింగ్ సొసైటీలో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా చెట్ల కొమ్మలతో వైర్లు తగులుతున్నాయని తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎన్‌పీడీసీఎల్ సిబ్బంది పట్టించుకోలేదని గౌతమినగర్ వాసులు ఆరోపిస్తున్నారు. పైగా హై వోల్టేజీతో నష్టం జరిగితే కోతులపై నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఎన్‌పీడీసీఎల్ అధికారులు జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు నష్టపరిహారం ఇచ్చేలా చూడాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎలిగేడు, సెప్టెంబరు 26: మండలంలోని ధూళికట్ట గ్రామానికి చెందిన మారం సతీష్(34)అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడని జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సతీష్ ఈనెల 22న బిల్డింగ్ మెట్ల పైనుంచి ప్రమాదవశాత్తు కాలుజారీ కిందపడ్డాడు. తలకు బలమైన దెబ్బ తగిలి ముక్కు, చెవుల నుంచి రక్తం కారింది. గమనించిన అతడి భార్య మధవి కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

2 నుంచి దుర్గా భవానీ శరన్నవరాత్రోత్సవాలు

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్26: కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని శ్రీదుర్గభవాని ఆలయంలో వచ్చే నెల 2 నుంచి 13వ తేదీ వరకు శ్రీదుర్గా భవాని శరన్నవరాత్సోవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మాధికారి వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ తెలిపారు. గురువారం ఆయన దేవాయలంలో శరన్నవరాత్రులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నవరాత్రులలో ప్రతి రోజు ఉదయం చండి హోమం, శ్రీచక్రపూజ, చతుష్ష ష్ట్యుపచార పూజ, విశస్త్రష హారతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు వంగళ లక్ష్మణ్, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి వేములవాడ ద్రోణాచారి, కమిటీ బాధ్యులు నీరుమల్ల తిరుపతి, శానగొండ మధుసూదన్, బాలాజీ అన్నపూర్ణ సేవా సమితి బాధ్యులు రాచమల్ల ప్రసాద్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు,పీఆర్సీ అమలు చేయాలి : డీటీఎఫ్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 26: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన ఐదు పెండింగ్ డీఏలలో కనీసం మూడు డీఏలు విడుదల చేసి జూలై-23 నుంచి పీఆర్సీ అమలు చేయాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు సందర్భంగా మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో నాణ్యమైన విద్య అందించడం సాధ్యపడదని, వెంటనే ప్రభుత్వం నియామకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు ఎ.దామోదర్, చకినాల రామ్మోహన్, రాష్ట్ర కౌన్సిలర్ పెరుక నర్సయ్య, ఎం.సంపత్‌రావు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో శునకాల పట్టివేత

భగత్‌నగర్, సెప్టెంబరు 26: కొత్తపల్లి మున్సిపాలిటీలో గురువారం శునకాలను పట్టుకుని ఏబీసీ సెంటర్‌కు తరలించారు. కరీంనగర్ కార్పొరేషన్‌లోని ఏబీసీ సెంటర్ (స్వతంత్ర ఏజెన్సీ హైదరాబాద్) వారి ఆధ్వర్యంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వాటిని పట్టుకుని బర్త్ కంట్రోల్ చేయనున్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

గణేశ్‌నగర్,సెప్టెంబర్ 26: వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో స్వచ్ఛతహీ సేవ 2024లో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బయటి ఆహారం తినడం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై ఒక లఘు నాటికను ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ధనపురి సాగర్, బైరం మహేష్, ఏసిఓబి సంపత్ కుమార్,ఏవో బి శ్రవణ్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన

భగత్‌నగర్, సెప్టెంబరు 26: కొత్తపల్లి మండలం మల్కాపూర్, చింతకుంట గ్రామాల్లోని ప్లాట్ల వద్ద జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు, ప్లకార్డులతో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏడాది క్రితం జర్నలిస్టులకు ప్రభుత్వం చింతకుంట, మల్కాపూర్ గ్రామాల్లో తమకు కేటాయించిన ప్లాట్లకు ఎన్ఓసీ ఇప్పించి, ప్రతిష్టంభనను తొలగించాలని కోరుతూ నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో మల్కాపూర్ ప్లాట్ల నుంచి చింతకుంట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఎంపీడీవో సస్పెన్షన్ ఎత్తివేయాలి

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్26: నల్లగొండ జిల్లాలో సస్పెన్షన్‌కు గురైన ఎంపీడీఓ, కార్యదర్శులను తిరిగి ఉద్యోగంలో చేర్చుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలతో మండల పరిషత్ అధికారులు, కార్యదర్శులు నిరసన వ్యక్తం చేశారు. మండల అధికారులు, కార్యదర్శులకు ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉద్యోగం చేసేలా వీలుకల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంజీవరావు, ఎంపీఓ జగన్మోహన్ రెడ్డి, మండల పరిషత్ కార్యలయ సిబ్బంది, మండలంలోని అన్ని గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 26: పోలీస్ కమిషనరేట్ పరిధిలోని టౌన్ డివిజన్‌లో రెండో పోలీసు ఠాణాను వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి తనిఖీ చేశారు. పోలీసు ఠాణాలో పెండింగ్ కేసులపై సమీక్ష చేశారు. వాటికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఠాణాలో పనిచేస్తున్న సిబ్బందిని వారు నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టిపెట్టి క్షేత్రస్థాయిలో ఫలితాన్నిచ్చే విధంగా సందర్శనలు ఉండాలన్నారు.శాంతి భద్రతల సమస్యలు, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. 100 డయల్ కాల్స్‌కు త్వరితగతిన స్పందించాలన్నారు టౌన్ డివిజన్ ఏసీపీ గోపతి నరేందర్, రెండో ఠాణా సీఐ పిట్టల విజయ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షల కోసం పుస్తకాలు అందజేత

గణేశ్‌నగర్,సెప్టెంబర్ 26 : పోటీ పరీక్షలకు అవసరమైన వివిధ పుస్తకాలను గురువారం డాక్టర్ బీఎస్‌రావుహెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీ.ఎస్.రావు శాతవాహన విశ్వవిద్యాలయ గ్రంథాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల పుస్తకాలతో విద్యార్థులు బాగా చదువుకుని లక్ష్యం చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి సురేంద్ర మోహన్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ వరప్రసాద్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి హరికాంత్, ఆర్ట్స్ కళాశాలప్రిన్సిపాల్ డాక్టర్ జాఫర్ జరి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయంతి పాల్గొన్నారు.

హుజూరాబాద్ ఎంఈవోగా శ్రీనివాస్

హుజూరాబాద్, సెప్టెంబరు 26: మండల విద్యాధికారిగా భూపతి శ్రీనివాస్ గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. హుజూరాబాద్ మండలం సింగాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను ఎంఈవోగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శ్రీనివాస్ మండల విద్యావనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించగా, పలువురు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఎంఈవోను శాలువాతో సన్మానించిన శుభాకాంక్షలు తెలిపారు.

ఇల్లందకుంట: మండల విద్యాధికారిగా కొర్ర రాములు గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఎంఈవోను వివిధ ఉపాధ్యాయ సంఘ నాయకులు మురళీ, జయప్రకాష్, వేణు, సంపత్, గోపి, ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ శాలువా తో సన్మానించి, అభినందించారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండల విద్యాధికారిగా మంతెన హేమలత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యా య సంఘాల నాయకులు ఆమెను సన్మానించారు. అందరి సహకారంతో మండల విద్యా వ్యవస్థను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎంఈవో తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



మాట్లాడుతున్న గో సంరక్షక్ సేవా సమితి ప్రతినిధి రాధాక్రిష్ణరెడ్డి

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 26: మండలంలోని కనుకులగిద్దె గ్రామంలోని రైతు వేదిక కార్యాలయంలో శుక్రవారం గోఆధారిత సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో గో సంరక్షక్ సేవాసమితి ప్రతినిధి పూట్కూరి రాధాక్రిష్ణరెడ్డి మాట్లాడు తూ గోవు ఆధారిత వ్యవసాయం చేయటం ద్వారా గోవుల సంతతి పెరగడంతో పాటు నేల ఆరోగ్యం, పంట ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. సేంద్రియ వ్యవసాయంలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి మండల వ్యవసాయాధికారి సిహెచ్ భూమిరెడ్డి, కేవీకే సేద్య విభాగ శాస్త్రవేత్త విజయ్‌లు వివరించారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కంకణాల రమేష్‌రెడ్డి, ఏఈవో నిఖిల్‌కుమార్, రైతులు ఉన్నారు.

పోలీసుల ఔదార్యం.. మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 26: మండలంలోని ధర్మరాజుపల్లి గ్రామంలో ఓ కుటుంబం దహన సంస్కారాలు చేసేందుకు కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడిన విషయం పత్రికల్లో రావడంతో ఏసీపీ శ్రీనివాస్‌జి స్పందించారు. ఈ మేరకు గురువారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం

హుజూరాబాద్, సెప్టెంబరు 26: పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయ సమీపంలో గురువారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశు ధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు బీపీ, షుగర్, ఇతరత్ర వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కమిషనర్ సమ్మయ్య, మేనేజర్ భూపాల్‌రెడ్డి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, డాక్టర్ జరీనా, డాక్టర్ స్నిగ్ధ, ఏఎన్ఎం విజయలక్ష్మి, కృష్ణకుమారి, మెడికల్ హెల్త్ అసిస్టెంట్ సత్యం, అధికారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మేయర్



హుజూరాబాద్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు, అధికారులు

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 26: రజాకార్లకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నగరంలో ఘనంగా నిర్వహించారు. గురువారం కలెక్టరేట్ రోడ్డులోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, కులసంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మేయర్ యాదగిరి సునీల్‌రావు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్పొరేటర్లు నేతికుంట యాదయ్య, కచ్చు రవి, నాయకులు సుధగోని కృష్ణగౌడ్, ఎడ్ల అశోక్, కోల సంపత్, రజక సంఘం నాయకులు మైఖెల్ శ్రీనివాస్, ప్రశాంత్, పూసాల సంపత్, రాజయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు బాస సత్యనారాయణరావు నివాళులర్పించారు.

మహిళాలోకానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ కొనియాడారు. చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి పోరాటస్ఫూర్తిని గుర్తుచేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు షౌకత్ అలీ, చేతి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలంలో పలు గ్రామాల్లో చాకలి ఐలమ్మ జయంతిని రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. నగర శివారులోని తీగలగుట్టపల్లి సరస్వతీ నగర్‌లో వేడుకలను నిర్వహించగా తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్‌రావు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పూసాల శ్రీకాంత్, కార్యదర్శి గుండేటి రాజు, రవి, అధ్యక్షురాలు గుండేటి మల్లీశ్వరి, మామిడి లత, ఎలగందుల అర్చన, పొన్నం కవిత, కొల్లూరి లత, రజిత, గంగిపెల్లి అరుణ పాల్గొన్నారు.

● కరీంనగర్ క్రైం: తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ చిత్రపటానికి అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మినారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(ఏఆర్) అనోక్ జైకుమార్, ఆర్ఐలు రజనీకాంత్, శ్రీధర్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

● గణేశ్‌నగర్: కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో బీసీ సంక్షేమ సంఘం నేతలు చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎన్నం ప్రకాష్ , జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, పాల్గొన్నారు.

● హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రి సమీపంలో చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, ఎడవెల్లి కొండాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కొలిపాక శంకర్, బాలరాజు, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, రత్నం, సదానందం, వెంకటస్వామి, మహేష్, సుమన్, శ్రీధర్, రాజు పాల్గొన్నారు.

● శంకరపట్నం: చాకలి అయిలమ్మ జయంతి శంకరపట్నంలో మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి అధికారులు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామంలోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శనిగరపు రజిత, అధ్యాపక బృందం పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● ఇల్లందకుంట: మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ కూడలి వద్ద రజక సంఘం మండలాధ్యక్షుడు రావుల ఎల్లయ్య ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, కుమార్, పెద్ది కుమార్, సంపత్, శ్రీనివాస్, ఆలేటి శ్రీరామ్, గూడేపు దేవేందర్ ఉన్నారు.

● సైదాపూర్: మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చాకలి అయిలమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పున్నం శ్రీనివాస్, పున్నం రాంమ్మూర్తి, మునిగంటి వెంకటేష్, మునిగంటి సంతోష్, మునిగంటి సమ్మయ్య, రాజు, సురేష్, నర్సయ్య పాల్గొన్నారు.

● గంగాధర: గంగాధర ప్రధాన రహదారి అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సింగిల్ విండో చైర్మన్ బాలగౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నవీన్‌రావు, మాజీ సర్పంచ్‌లు విజేందర్‌రెడ్డి, దామోదర్, నజీర్‌హుస్సెన్ ఉన్నారు.

● గన్నేరువరం: మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. తహశీల్దారు ఇప్ప నరేందర్, రజకసంఘం గ్రామ, మండల అధ్యక్షులు మునిగంటి మల్లయ్య, మునిగంటి నాగరాజు ఉన్నారు.

● చొప్పదండి: చొప్పదండి మున్సిపల్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ నాగరాజు కౌన్సిలర్ కొత్తూరి మహేశ్ ఉన్నారు.

● జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని హుజూరాబాద్ రోడ్డులో గల చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద చాకలి ఐలమ్మ జయంతి ఘణంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటీలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీజేపీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడకలు నిర్వహించారు.

● రామడుగు: చాకలి ఐలమ్మ స్ఫూర్తితో యువకులు ముందుకు సాగాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని వెలిచాల గ్రామంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్‌లు ఒంటెల మురళీకృష్ణరెడ్డి, రాజు, నరసింహరాజు, మాజీ ఎంపీపీలు వీర్ల నర్సింగరావు, జవాజి హరీష్ పాల్గొన్నారు.

● చిగురుమామిడి: మండలంలో చాకలి ఐలమ్మ జయంతి ఘణంగా నిర్వహించారు. రేకొండలో ఐలమ్మ విగ్రహానికి జిల్లా రజక సంఘం నాయకులు దుడ్డెల లక్ష్మీనారయణ అధ్వర్యంలో పూలమాలలు వేశారు.

తెలంగాణ టీచర్స్ క్రికెట్ సంఘ కార్యవర్గం ఎన్నిక

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబర్26: తెలంగాణ టీచర్స్ క్రికెట్ అసోసియేషన్ కార్యవర్గంను ఎన్నుకున్నారు. కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో గురువారం ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా హన్మకొండకు చెందిన స్టాలిన్ ఎంపిక కాగా ప్రధాన కార్యదర్శిగా సిరిసిల్లకు చెందిన జయ కృష్ణారెడ్డి, కోశాధికారిగా గౌరవ అధ్యక్షుడిగా సిరిసిల్లకు చెందిన శర్మన్ నాయక్,అదిలాబాద్‌కు చెందిన ఉపేందర్ రాథోడ్, ఉపాధ్యక్షులుగా జగిత్యాలకు చెందిన ఇనారా పవార్, సూర్యాపేటకు చెందిన సిద్దిక్ ఎంపికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన స్టాలిన్ మాట్లాడుతూ ప్రతి జిల్లా నుంచి ఒక జట్టు చొప్పున హన్మ కొండ కరీంనగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలోని క్రీడా వేదికల్లో ప్రిలిమినరీ పోటీలను నిర్వహించి విజేతలైన నాలుగు జట్లకు హైదరాబాద్‌లో ఫైనల్ నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు సెల్‌నెం. 63041 40710లో సంప్రదించాలన్నారు.

స్వచ్ఛమైన వాతావరణానికి ప్రకృతి వనాలు దోహదం



ప్రకృతి వనంలో మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 26: నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనాలు ప్రజలకు స్వచ్ఛమైన గాలి, వాతావరణాన్ని అందిస్తున్నాయని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం నగరంలోని బుల్‌సెమన్ సెంటర్‌లోని 25 లక్షల ఎకరాల్లో లక్షకుపైగా మొక్కలతో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనాన్ని సందర్శించారు. వివిధ రకాల ఔషధ, పండ్ల, పూల మొక్కలతో నాటిన వనంలో పర్యటించి ఆహ్లాదకరవాతావరణాన్ని ఆస్వాదించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి యేడాది హరితహారంలో భాగంగా నాటిన మొక్కలతో చక్కటి గ్రీనరీతోపాటు ఆహ్లాదకర వాతావరణం నెలకొందని, గతంలో నాటిన మొక్కలను కాపాడటంతో చక్కటి ఫలితాలు వస్తున్నాయన్నారు. నగరం గ్రీన్, ఆరోగ్యసిటీగా మారుతుందని, ప్రజలు ఈ యజ్ఞంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్పొరేటర్లు నేతికుంట యాదయ్య, బోనాల శ్రీకాంత్, కచ్చు రవి, ఎడ్ల సరిత అశోక్, సుధగోని మాధవికృష్ణగౌడ్ తదితరులు ఉన్నారు.

మహిళా ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మహిళా ప్రాంగణం పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తిమ్మాపూర్, సెప్టెంబరు 26: కరీంనగర్ మహిళా ప్రాంగణాన్ని అభివృద్ధి చేసి మహిళలకు ఉపాధి కల్పించే దిశగా కృషి చేస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల మహిళా శిశువికాస కేంద్రాన్ని మహిళా సహకార అభివృద్ధి కార్పొరే షన్ చైర్మన్ బండ్రు శోభారాణితో కలిసి సందర్శించారు. మహిళా ప్రాంగణాన్ని, పరిసరాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా ప్రాంగణాలను పది సంవత్సరాలుగా పట్టించుకున్న నాథుడు లేడని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మహిళల స్వయం ఉపాధికి అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి మహిళా అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా ప్రణాళికలు రూపొందించి త్వరలోనే కరీంనగర్‌లోనూ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. చెట్ల పొదలు, గడ్డి, చెత్తా చెదారంతో నిండి పోయిన మహిళా ప్రాంగణాన్ని నెలరోజుల్లో పాత స్థితికి తీసుకువస్తామన్నారు. అనంతరం ప్రాంగణం పరిసరాల్లో మొక్కలు నాటి నీళ్ల పోశారు. కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోగూరి నర్సింహారెడ్డి, మహిళా ప్రాంగణం ఇన్‌చార్జి మేనేజర్ జయశ్రీ, తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ మేనేజర్ విజయశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● రాంలీలా మైదానం పరిశీలన..

మండలంలోని ఎల్ఎండీ కాలనీలో దసరా ఉత్సవాలు నిర్వహించేందుకు రాంలీలా మైదానాన్ని గురువారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మైదానంలో ప్రతి సంవత్సరం దసరా వేడుకలను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దసరా ఉత్సవ కమిటీ కన్వీనర్ కుంట రాజేందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఎల్ఎండీలోకి మిడ్ మానేరు నుంచి ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్, సెప్టెంబరు 26: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి మిడ్ మానేరు నుంచి గురువారం మధ్యాహ్నం ఇరిగేషన్ అధికారులు నీటి విడుదల చేశారు. మొత్తం 3,850 క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి వస్తోంది. ఎల్ఎండీ పూర్తి స్థాయి సామర్థ్యం 24.034 టీఎంసీలకు కాగా ప్రస్తుతం 22.246 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు వెల్లడించారు.

'అధికారులను విధుల్లోకి తీసుకోవాలి'

చిగురుమామిడి, సెప్టంబరు 26: ఇటీవల నల్గొండ జిల్లాలో ఎంపీడీవోను, పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేశారని వారిని విధుల్లోకి తీసుకోవాలని అ ధికారులు డిమాండ్ చేశారు.ఈ మేరకు గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీడీ వో ఎండీ ఖాజామొయినోద్దిన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు అజయ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

అధికారుల పరిశీలన

శంకరపట్నం, సెప్టెంబరు 26: మండలంలోని కన్నాపూర్‌లో టీఎస్ ఎన్‌పీడీసీఎల్ అధికారులు గురువారం పరిశీలించారు. ఇళ్ల మధ్య నుంచి 11 కేవీ ఇండస్ట్రియల్ విద్యుత్ లైన్ వేయడం వల్ల ప్రమా దాలు జరుగుతున్నాయని, విద్యుత్ లైన్ పనులు నిలిపివేయాలని టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ హనుమకొండ ఆఫీస్‌లో గ్రామస్థులు ఇటీవల ఫిర్యాదు చేశారు. గురువారం డీఈ లక్ష్మారెడ్డి, ఏడీ శ్రీనివాస్ విద్యుత్ లైన్ ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తీసుకున్నారు. వారి వెంట ఏఈ సంపత్‌రెడ్డి, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ స్ర్కీనింగ్ చేయించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హుజూరాబాద్, సెప్టెంబరు 26: ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ స్ర్కీనింగ్ చేయించుకోవాలని జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ డీపీఎం సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం హుజూరాబాద్ ఏరియా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు నర్సింగ్, ల్యాబ్ స్టూడెంట్స్, విద్యార్థులతో ఎయిడ్స్ నివారణపై నినాదాలు చేస్తూ, పాటల రూపంలో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ హెచ్ఐవీతో బాధపడే ప్రతి ఒక్కరూ విధిగా ఏఆర్‌టీ మందులు వాడాలన్నారు. హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఏఆర్‌టీ మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. హెచ్ఐవీ గురించి సమాచారం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1097 ద్వారా సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఆర్ఎంవో సుధాకర్‌రావు, డాక్టర్ నారాయణరెడ్డి, జిల్లా ఐసీటీసీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి మార్గంలో పయనించాలి

నార్కోటిక్స్ బ్యూరో ఏసీపీ ఉపేందర్



మాట్లాడుతున్న యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఏసీపీ

చొప్పదండి సెప్టెంబరు 26: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మంచి మార్గంలో పయనించాలని యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఏసీపీ ఉపేందర్ సూచించారు. మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ సైనిక స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ గంజాయి పెంచడం, రవాణా చేయడం లేదా ఏ రూపంలో కూడా దానిని తీసుకోవడం నేరమని తెలిపారు.

ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం కఠినమైన శిక్షలు ఉంటాయనీ విద్యార్థులకు వివరించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐలు కృష్ణమూర్తి, ప్రకాష్‌గౌడ్, సైనిక్ స్కూల్ డైరెక్టర్ కల్నల్ కెసి రెడ్డి, ప్రిన్సిపల్ కాళహస్తి, ఎస్ఐ అనూష, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గురుకుల ఉపాధ్యాయుల ధర్నా

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 26: గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద తలపెట్టిన ధర్నాకు పెద్ద ఎత్తున గురుకుల ఉపాధ్యాయులు తరలివచ్చి విజయవంతం చేయాలని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చావ రవి పిలుపునిచ్చారు. గురువారం యుటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి మాట్లాడారు.

చెస్ అకాడమీ ఆధ్వర్యంలో సంబరాలు

కరీంనగర్‌స్పోర్ట్స్,సెప్టెంబర్ 26: ఒలింపియాడ్‌లో భారత చదరంగం పురుషుల, మహిళల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా కరీంనగర్‌లోని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. త్రివర్ణ పతాకం చేతబట్టుకొని బుధవారం అంబేద్కర్ స్టేడియంలో ర్యాలీ నిర్వహించారు. జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, కంకటి సుజన్ కుమార్ పాల్గొన్నారు.

'హైడ్రాతో పేదలకు నష్టం లేదు'

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్26:హైడ్రాతో పేదలకు నష్టం లేదని, కాంగ్రెస్ పాలనను చూసి కేసీఆర్, కేటీఆర్‌లు జీర్ణించుకోలేక పోతున్నారని కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం తీగలగుట్టపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమృత్ టెండర్ విషయంలో కేటీఆర్ ఎన్నో ఆరోపణలు చేశారని అన్నారు. ఈ సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకట రమణారెడ్డి, ఇట్టిరెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్య పురస్కార్ అవార్డుకు అర్హత

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 26: రాజ్య పురస్కార్ అవార్డుకు జిల్లా కేంద్రంలోని పారమిత ఉన్నత పాఠశాల స్కౌట్స్, గైడ్స్ అర్హత సాధించారు. ఇటీవల ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన తృతీయ తోపాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ టెస్టింగ్ క్యాంపులో పాల్గొని విశేష ప్రతిభచాటిన విద్యార్థులు, అవార్డుకు అర్హత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. పాఠశాల విద్యార్థులు 13 మంది స్కౌట్స్, ఆరుగురు గైడ్స్ ఈ అవార్డుకు అర్హత సాధించి త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే సభలో అవార్డులను అందుకోనున్నారని తెలిపారు. పారమిత విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ వి ప్రసాద్‌రావు, డైరెక్టర్ ప్రసూన, అనూకర్‌రావు, ప్రసాద్, టీఎస్‌వి రమణ అభినందించారు.

9వ డివిజన్‌లో కాంగ్రెస్ సభ్యత్వ నమోదు

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 26: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఆదేశాలతో మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్య సమక్షంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్లం కనకలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం డివిజన్‌లో పలువురు మహిళలు కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు.

స్మార్ట్‌సిటీ నిధుల వినియోగంపై యూసీ ఇవ్వని ప్రభుత్వం : బీజేపీ

భగత్‌నగర్, సెప్టెంబరు 26: స్మార్ట్‌సిటి నిధుల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం యూసీ ఎందుకివ్వలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బాస సత్యనారాయణ గురువారం ప్రశ్నించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి రూ.30.62 కోట్ల నిధులు విడుదలై మూడు నెలలైనా ఇంత వరకు నిధుల వినియోగంపై యూసీ ఎందుకివ్వలేదన్నారు.

తిరుమల పవిత్రతను దెబ్బ తీసే చర్యలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 26: తిరుమల పవిత్రతను, సంప్రదాయాలను దెబ్బతీసే విధంగా చూస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ బ్రాహ్మణ శ్రీవైష్ణవ సేవాసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీచర కృష్ణమాచార్యులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

● సంక్షిప్త సమాచారం..

● సైదాపూర్: ట్రెజరీల ద్వారా బిల్లులు చెల్లించాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రవీంద్రచారి పేర్కొన్నారు. మండలంలోని ఎక్లాస్‌పూర్, సోమారం, వెన్నంపల్లి, వెన్కేపల్లి, సైదాపూర్, దెద్దెనపల్లి, వెంకటేశ్వర్లపల్లి, ఆకునూర్ పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.

- సైదాపూర్ మండలంలోని ఆకునూర్ క్లస్టర్ పరిధిలోని వివిధ గ్రామాలలో జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్ వరి పంటలను పరిశీలించారు.

● హుజూరాబాద్‌రూరల్: విద్యార్థి కళాశాల చదువు పూర్తి చేసుకొని ఉద్యోగంలో చేరినా నిత్య విద్యార్థిలా కొత్త సాంకేతిక అంశాలను నేర్చుకుంటూ, వాటిపై పట్టు సాధిస్తేనే భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ శిక్షకుడు వేముగంటి రమేష్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు.

●శంకరపట్నం: శంకరపట్నం మోడల్ స్కూల్‌లో కోతి, కుక్క కాటుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశువైద్యాధికారి డాక్టర్ మాధవరావు అవగాహన కల్పించారు.

● మానకొండూర్: మానకొండూర్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మండల పశువైద్యశాఖ ఆధ్వర్యంలో కుక్కలు, కోతుల దాడి, నివారణపై విద్యార్థులకు పశువైద్యులు అరవింద్‌రెడ్డి అవగాహన కల్పించారు.

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంట, కృష్ణాకాలనీలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 140మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు.

● జమ్మికుంట: ప్లాస్టిక్‌ను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఓదెలు కుమార్ అన్నారు. గురువారం జమ్మికుంట పట్టణంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నియంత్రణపై ర్యాలీ నిర్వహించారు.

● వీణవంక : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 సంవత్సరం పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు తోటి మిత్రుడు గోట్టె సుమన్ తల్లి భాగ్య మృతి చెందగా వారి కుటుంబానికి 1,1800 రూపాయల ఆర్థికసాయం అందించారు.

● చొప్పదండి: చొప్పదండిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన నిరుపేద బుర్ర రాజు ఇటీవల మరణించగా గంగాధర మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన సామాజికవేత్త తూడి లచ్చన్న పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

● వీణవంక: మండలంలోని ఎల్బాక గ్రామంలో బాబు జగ్జీవన్‌రాం విగ్రహాన్ని గ్రామస్థులు అవిష్కరించారు.సింగిల్ విండో చైర్మన్ మావురపు విజ యభాస్కర్ రెడ్డి,నాయకులు మాడ సాధవరెడ్డి పాల్గొన్నారు.

● రామడుగు: మండల కేంద్రంలోని గడికోటను అల్ఫోర్స్ ఈ టెక్నో కొత్తపల్లి పాఠశాల విద్యార్థులు విహారయాత్రలో భాగంగా సందర్శించారు.

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలం తనుగుల పరిధిలోని మానేర్ నుంచి ఇసుక తీసుకువస్తున్న నాలుగు లారీలను శంబునపల్లిలో గురువారం రాత్రి సీఐ వరంగంటి రవికుమార్ పట్టుకున్నారు.